క్లుప్తంగా

ప్రజావాణి దరఖాస్తులను పరిశీలిస్తాం



వినతిపత్రం స్వీకరిస్తున్న తహసీల్దార్ రాంబాబు

మధిర: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి ఆయా సమస్యల పరిష్కారానికి వెంటనే కృషి చేస్తామని మధిర తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన మాట్లాడారు. మధిర మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య సమస్యపై అదే విధంగా పలు గ్రామాల్లో పెన్షన్లు మంజూరు చేయాలని కోరుతూ.. దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలి

వైరా: వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో సాగు భూములకు రబీ సీజన్లో రెండో పంటకు సాగు నీరు విడుదలపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరుతూ.. సోమవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు, ఇరిగేషన్ డీఈ శ్రీనివాస రావుకు వినతిపత్రం అందజేశారు. ఖరీఫ్‌లో వర్షాలు, తెగుళ్ల బారిన పడి పంట నష్టపోయామని, ఇకనైనా వైరా రిజర్వాయర్ కాలువలకు మరమ్మతులు చేపట్టి యాసంగిలో సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బొంతు రాంబాబు, నాయకులు రామారావు, చలపతిరావు పాల్గొన్నారు.

ఘనంగా నాగేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



సదాశివునిపేటలో గ్రామ సంకీర్తన చేస్తున్న భక్తులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని సదాశివునిపేట నాగేంద్రస్వామి ఆలయ 5వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారణ భక్తులు గ్రామ సంకీర్తన, మహాపడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బండి మాధవరెడ్డి, మరీదు శివ, సత్యనారాయణ, చొప్పరి పద్మ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మధిర: క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం వస్తుందని మధిర డివిజన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ డి.నరసయ్య తెలిపారు. సోమవారం మధిర డివిజన్ పరిధిలోని బీసీ వసతి గృహ బాలికల, బాలుర క్రీడలను మధిర పట్టణంలోని టీవీఎం పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్లు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, జ్యోష్ణ, శృతి తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై దాడికి నిరసన



వైరా: నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న రెవెన్యూశాఖ అధికారులు

వైరా/ఎర్రుపాలెం: వికారాబాద్ జిల్లా కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్, కొడంగల్ తహసీల్దార్లపై దాడిని నిరసిస్తూ అధికారులు, సిబ్బంది నిరసన తెలిపారు. వైరా, ఎర్రుపాలెం మండలకేంద్రాల్లోని తహసీల్‌లో.. తహసీల్దార్లు కేవీ శ్రీనివాసరావు, ఉషాశారద, రెవెన్యూ సిబ్బంది, సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్లు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో అధికారులపై దాడులు చేయడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రవికుమార్, రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ అభిరామ్, జూనియర్ అసిస్టెంట్లు బాజీబాబా, వరలక్ష్మి, వెంకటేశ్వరరావు, ధరణి ఆపరేటర్ నరేష్ పాల్గొన్నారు.

వైద్య సేవలు మెరుగుపరచాలి

బోనకల్: మండలంలో ప్రభుత్వ వైద్య సేవలను మెరుగు పరచాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనంద్‌రావు, సహాయ కార్యదర్శి ఆకెన పవన్‌లు ప్రజావాణిలో ప్రత్యేక అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30పడకల ఆస్పత్రిగా మార్చేందుకు కృషి చేయాలని కోరారు. గ్రామీణ వైద్యులపై దాడులను అరికట్టాలని కోరారు. అత్యవసర పరిస్థితులలో ప్రాథమిక చికిత్స అందించేందుకు గ్రామీణ వైద్యులకు అవకాశం కల్పించాలని కోరారు.

సంక్షోభంలో పాడి పరిశ్రమ

- రోజు రోజుకు పెరుగుతున్న నిర్వహణ వ్యయం
- గిట్టుబాటు కాని పాల ధరలు
- నష్టాలపాలవుతున్న పాడి రైతులు



డెయిరీలో లీటర్ పాలకు రోజు వారీగా ధరల పట్టిక



రేకుల షెడ్డులో గేదెలు



ఓ రైతు ఇంట్లో ఆవు దూడలు

వైరారూరల్: కొండామంటే కొరివి.. అమ్మాలంటే అడవి.. అన్న చందంగా ఉంది. పాడి రైతులు పరిస్థితి. కేంద్రాల్లో పాల ధరలు పెరగకపోవడం, పశుగ్రాసం, పచ్చి జాడు కొరతతో పాటు దాణా ధరలు అమాంతం పెరగడంతో పాడి పోషణ వ్యయం పెరిగి రైతులు నష్టాల పాలవుతున్న సమయాన పాడి రైతులు పశువులను నిలువున అమ్ముకునేందుకు సిద్ధపడుతున్నారు.

- కొన్నేళ్ల క్రితం వరకు నియోజకవర్గంలో పాడి పరిశ్రమ రైతులకు మూడు పూవ్వులు.. ఆరు కాయలు చందంగా లాభాల పంట కురిపించింది. సుమారు నాలుగేళ్ల నుంచి పాల ధరలు తగ్గి.. నిర్వహణ వ్యయం పెరుగుతుండడంతో పాడి రైతులు నష్టాల లోబిలో కురుకుపోతున్నారు. దీంతో పాడి పరిశ్రమపై ఎంత కష్టం చేసిన ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని రైతులు పంటలు సాగు చేసేందుకు వేలకు వేలకు అప్పులు తెచ్చి బోర్లను వేయడం వాటిలో నీరు రాని కారణంగా కూడా రైతులు నష్టపోతున్న సందర్భాలు అనేకంగా ఉన్నాయి.

పెరగని పాల ధరలు..

గతంలో పాడి పరిశ్రమ నిర్వహణలో లాభాలు ఎక్కువగా ఉండడంతో రైతులు ఇతర రాష్ట్రాల నుంచి రూ.50 నుంచి రూ.70 వేల వరకు ధరలు వెచ్చించి గెదేలు, ఆవులను కొనుగోలు చేశారు. వాటి నిర్వాహణ కోసం వ్యవసాయ పొలాల్లో లక్షలు వెచ్చించి షెడ్లు, నీటి వసతి, వరి గడ్డి తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసుకున్నారు. కాగా పాల ఉత్పత్తిలో మండలంలోని పలు గ్రామాలు జిల్లాల్లో ప్రసిద్ధి గాంచాయి. స్థానికంగా పలువురు ఆటోల ద్వారా ఖమ్మంలోని పెద్ద హోటళ్లకు పాలను సరఫరా చేస్తుంటారు. ఇటువంటి రైతులు పాల ఉత్పత్తి ద్వారా ఎంతో కొంత జీవనోపాధి పొందుతున్నప్పటికీ కేంద్రాలు, డెయిరీలపై ఆధారపడిన పాడి రైతులకు గిట్టుబాటు కావడం లేదని మదనపడుతున్నారు. ప్రస్తుతం రైతుల నుంచి సేకరిస్తున్న పాల ధరలకు శాతాన్ని బట్టి రూ.40 నుంచి 45 వరకు చెల్లిస్తున్నారు. అధిక శాతం వస్తే మాత్రం రూ.50 వరకు పాల ధర పలుకుతుంది. కానీ బహిరంగ మార్కెట్‌లలో అదే డెయిరీలు, కేంద్రాలు రూ.60 నుంచి రూ.70 వరకు ఒక లీటర్‌ను విక్రయిస్తున్నారని పాడి రైతులు వాపోతున్నారు.

పైపైకి దాణా ధరలు..

గతంలో పశుగ్రాసం, దాణా ధరలు పాడి రైతులకు అందుబాటులో ఉండడం పాడి పరిశ్రమ లాభసాటిగా కొనసాగిన సమయాల్లో రైతులు భారీ సంఖ్యలో గెదేలు, ఆవులను కొనుగోలు చేశారు. ప్రస్తుతం గతంతో పోల్చుకుంటే పశుగ్రామం, దాణా ధరలు రెండింతలు పెరిగాయని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పశువులకు నిత్యం అవసరమయ్యే పశుగ్రాసం కట్ట రూ. 100, పచ్చి జాడు కట్ట రూ. 200 వరకు ధర పలుకుతుంది. అంతేకాకుండా పశువుల దాణా అయిన తౌడు క్వింటా రూ. 3,000, పెసర పట్టు క్వింటా రూ. 4,200, కొబ్బరి పిట్టు రూ. 5,000 వరకు ధర ఉండడంతో పాడి రైతులు పశువులకు దాణా కొనలేక ఆర్థికంగా చతికిల పడుతూ నష్టాల పాలవుతున్నారు. కొంత మంది రైతులు పాడి పోషణ భరించలేక తమ పశువులను తక్కువ ధరలకు విక్రయించి మేలు జాతికి చెందిన కోడు దూడలను కొనుగోలు చేసి వాటి పోషణపై దృష్టి సారించారు. అధిక ధరలు వెచ్చించి దాణాలు, పశుగ్రాసం, కొన్నప్పటికీ పాల కేంద్రాలు, డెయిరీలలో పాల ధరను తగ్గిస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి పాడి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

భారమైన పశు పోషణ..



గతంతో పోలిస్తే పశు పోషణ భారంగా మారింది. పశుగ్రాసం, దాణా ధరలు రెండింతలు అధికమయ్యాయి. పాల కేంద్రాలు, డెయిరీలలో లీటర్ పాలకు శాతాన్ని బట్టి అత్యధికంగా రూ. 45 వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. డెయిరీలు మాత్రం ఇతరులకు రూ. 70కు విక్రయించి లబ్ధిపొందుతున్నారు. దాంతో పశు పోషణ భరించలేక పశువులను విక్రయించి మేలు జాతికి చెందిన కోడు దూడలను కొనుగోలు వాటిని పోషిస్తున్నాను.

– ముక్కార పుల్లారెడ్డి, పాడి రైతు, దాచాపురం

పెరుగుతున్న నిర్వహణ వ్యయం..



పాడి పరిశ్రమ నిర్వహణ వ్యయం రోజు రోజుకు పెరుగుతుంది. పాల వ్యాపారం చేయడం కష్టతరంగా మారింది. పశువులకు కావాల్సిన పశుగ్రాసం, పలు రకాల దాణాల ధరల మార్కెట్ రోజు రోజు పెరగడంతో పాటు.. పాల ధరలు తగ్గుతుండడంతో పాశు సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. వాటిని విక్రయించినా సగం ధర కూడా పలకడం లేదు. దీంతో తీవ్రస్థాయిలో నష్టం జరుగుతుంది.

– శీలం విష్ణు, పాడి రైతు, స్నానాల లక్ష్మీపురం

కార్తీక పూజలు

కార్తీక మాసం సోమవారం సందర్భంగా ఆలయాలు శివనామస్మరణలతో మార్మోగాయి. తెల్లవారుజామునే తలంటు స్నానాలు ఆచరించి ఆలయాలలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగాలకు అభిషేకాలు చేశారు. పుట్టల్లో పాలుపోసి నాగదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదములు పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లిటౌన్: దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ఏన్కూరు శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

శివాలయంలో అన్నదానం

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని వెంగళరావునగర్‌లో గల శ్రీభ్రమరాంభిక సమేత మల్లిఖార్జున స్వామి శివాలయంలో సోమవారం సీహెచ్ రమేష్ బాబు, పి.వెంకటసత్య రవిచైతన్యలు భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆల య వ్యవస్థాపకులు రామడుగు గురుబ్రహ్మాచా ర్యులు, పద్మ, శరత్, శంకర్, శ్రీనివాసాచారి, రజిని, బాబురావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శివాలయానికి వెండి పాదాలు బహూకరణ



అమ్మవారికి వెండి పాదాలను బహూకరిస్తున్న దాతలు

బోనకల్: మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలోని శ్రీమలినాథ మహానాగ శివాలయంలో వేంచేసి ఉన్న పార్వతీ అమ్మవారికి వెండి పాదాలను గ్రామానికి చెందిన తన్నీరు రంగయ్య కూతురు, అల్లుడు దొంతినేని ప్రసాద్, కళావతి దంపతులు సోమవారం అందజేశారు. వీరికి ఆలయ పండితులు వేదమంత్రాల నడుమ మంగళవాయిద్యాలతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హమాలీ కూలీరేట్ల పెంపు

సత్తుపల్లి: సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో హమాలీ కూలీరేట్లు పెంచాలని కార్మికులు సమ్మెకు దిగటంతో వ్యాపారస్తులతో సంఘ ప్రతినిధులు చర్చలు జరిపి కూలీ రేట్లు పెంపుదల జరిగిందని టీయూసీఐ జిల్లా నాయకుడు ఎ.శరత్ తెలిపారు. సోమవారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో 70 కేజీల ధాన్యం బస్తాకు రూ.30 ఉండగా.. ప్రస్తుతం రూ.33లకు పెంపుదల జరిగిందన్నారు. ఈ చర్చల్లో ధాన్యం వ్యాపారస్తులు నడిపల్లి రాము, గుండు ప్రసాద్, రాంబాబు, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, చెన్నారావు, అప్పారావు, మారేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయండి..



మాట్లాడుతున్న మాచర్ల భారతి

సత్తుపల్లి: డిసెంబర్ 18, 19వ తేదీల్లో సత్తుపల్లిలో జరిగే సీపీఎం 22వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి, జిల్లా కమిటీ సభ్యుడు మాదినేని రమేష్ పిలుపునిచ్చారు. సత్తుపల్లిలోని రావి వీరవెంకయ్య భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాసభలకు జిల్లాలోని 500 మంది డెలిగేట్స్‌తో పాటు రాష్ట్ర, జాతీయ నాయకులు ముఖ్యఅతిథులుగా హాజరౌతారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు పాండు, సర్వేశ్వరరావు, వెంకట్రావు, రమేష్, వలీ, వెంకటేశ్వరరావు, శ్రీహరి, ఝాన్సీ పాల్గొన్నారు.

ఐక్య క్రిస్మస్ పోస్టర్ల ఆవిష్కరణ



క్రిస్మస్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కల్లూరు: కల్లూరు పట్టణ కేంద్రంలో డిసెంబర్ 12న జరిగే ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఏబీసీ రాష్ట్ర అధ్యక్షుడు పి.ఎనోష్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం టీజీఎం ప్రేయర్ టవర్ నందు.. మండల అధ్యక్షుడు తేళ్ల ఎబినైజర్ అధ్యక్షతన నిర్వహించిన మండల సేవకుల సమావేశంలో ఆయన పాల్గొని క్రిస్మస్ వేడుకల పోస్టర్లను జిల్లా ప్రేయర్ సెల్ అధ్యక్షుడు తేళ్ల నిర్మల్ కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ వేడుకలకు రాజా ఫెయిత్ మినిస్ట్రీస్ హైదరాబాద్ పాస్టర్ రాజా హెబెల్ రానున్నారని, ప్రతి ఒక్కరూ హాజరై.. దైవ ఆశీర్వాదం పొందాలని కోరారు. సభకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయిలు పాల్గొంటారని చెప్పారు. ప్రత్యేక ఆకర్షణగా క్రిస్మస్ గీతాలాపన, క్యాండిల్ సర్వీస్, చిన్నారుల ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్నాశి బాలరాజు, మీడియాసెల్ జిల్లా అధ్యక్షుడు దాసరి డేవిడ్ రాజు, సంజీవరావు, పాస్టర్లు జాన్ పరంజ్యోతి, జీవన్‌కుమార్, రాజశేఖర్, సుందర్‌రాజు, సమర్పణపాల్, తిమోతి, జీవీ దాసన్న, సంతోష్‌కుమార్, నిఖిల్, దాసు, ప్రచార కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఘనంగా మైనార్టీ దినోత్సవం



సత్తుపల్లిలో కేంద్ర తొలి విద్యాశాఖామంత్రి అబుల్ కలామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సత్తుపల్లి/కొణిజర్ల/కారేపల్లి: సత్తుపల్లిలోని మైనార్టీ పాఠశాలలో, కొణిజర్లలోని అమ్మపాలెం పంచాయతీ పరిధిలో, కారేపల్లిలోని ఎస్ఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల భవన సముదాయంలో సోమవారం మైనార్టీడే దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర తొలి విద్యాశాఖామంత్రి అబుల్ కలామ్ ఆజాద్ జయంతి పురస్కరించుకొని మైనార్టీడే, జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. అనంతరం ఆజాద్ చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించారు. సత్తుపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆజాద్, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ పాలాభిషేకం చేయగా.. కొణిజర్లలో నిర్వహించిన కార్యక్రమంలో బాలురు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. విద్యార్థుల నృత్యప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. అదే విధంగా కారేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో అబుల్ కలామ్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పూర్వవిద్యార్థి ఎస్‌డీ ఆసియా జేఎన్‌టీయూహెచ్ హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ సీటు సాధించడంతో పాటు, సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రం తీసుకోవడంతో ఆమెను ఎస్ఎస్ రాజారాం, ప్రిన్సిపాల్ శైలజలు జ్ఞాపికతో అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకట్రామయ్య, సదర్ రసూల్, కమల్‌పాషా, కరుణాకర్, రియాజుద్దీన్, శ్రీనివాసరావు, చెన్నారావు, నరేందర్‌రెడ్డి, సందీప్‌గౌడ్, ప్రిన్సిపాల్ లింగాల జితేష్ సాహిల్, కళాశాల కోఆర్డినేటర్ కొండలరావు, పాఠశాల కోఆర్డినేటర్ శ్రీవిద్య, డిప్యూటీ వార్డెన్ యాకూబ్ పాషా, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, ప్రిన్సిపాల్ శైలజ, స్థానిక మైనార్టీ పెద్దలు షఫీ, అబ్దుల్ మతీన్, యాకూబ్ అలీ, తాజుద్దీన్, టోనీవీర ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే గిట్టుబాటు ధర



వైరా: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

వైరా/ఏన్కూరు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. వైరాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. ఏన్కూరు మండలంలోని జన్నారం, తిమ్మారావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం రాజలింగాల, బురదరాఘవాపురం గ్రామాల్లో ఐకేపీ భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, శీలం వెంకటనర్సిరెడ్డి, పాదిలి హరినాధ్, మిట్టపల్లి నాగి, పణితి సైదులు, ఏదునూరి సీతారాములు, ఏడీఏ కరుణశ్రీ, ఏఓ మయాన్ మంజుఖాన్, డీసీఎంఎస్ అధికారులు పాల్గొన్నారు.

పెద్దకోరుకొండిలో..



కల్లూరురూరల్: పెద్దకోరుకొండిలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

కల్లూరురూరల్/వేంసూరు: కల్లూరు మండలంలోని పెద్దకోరుకొండి గ్రామంలో, వేంసూరు మండలంలోని వెంకటాపురం గ్రామంలో సోమవారం ఐకేపీ, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఏడాది ప్రభుత్వం మంచి మద్దతు ధరతో పాటు బోనస్ రూ.500లు ఇస్తున్నందున ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయించవద్దని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్లు ఆనంద్‌బాబు, నీరజాదేవి, కల్లూరు వ్యవసాయాధికారిని ఎం.రూప, ఆర్డీఓ రాజేంద్రగౌడ్, తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఐకేపీ ఏపీఎం వెంకటరామారావు, సొసైటీ సీఈఓ అంజయ్య, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే జాగ్రత్తగా నిర్వహించండి



కల్లూరురూరల్: సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ రాజేందర్‌గౌడ్



కొణిజర్ల: తనికెళ్లలో మహిళతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రాంబాబు

కొణిజర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుల గణన సర్వే కొణిజర్ల మండలంలోని 27 పంచాయతీల్లో ముమ్మరంగా సాగుతుంది. సోమవారం ఎన్యూమరేటర్లు చేస్తున్న సర్వే తీరును నియోజకవర్గ ప్రత్యేకాధికారి డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీఓ అయిత రోజారాణి, ఎంపీఓ రాజేశ్వరి పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు కొనసాగించడానికి ప్రజలు పూర్తి సమాచారం ఇచ్చి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

- కల్లూరురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని కల్లూరు ఆర్డీఓ రాజేంద్రగౌడ్, ఎమ్మెల్యే రాగమయి ఎన్యూమరేటర్లకు సూచించారు. సోమవారం కల్లూరు మండలంలోని పెద్దకోరుకొండి, లింగాల గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. సర్వే కోసం వచ్చిన ఎన్యూమరేటర్లకు ఖచ్చితమైన సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఆర్ఐ అన్వర్, సిబ్బంది పాల్గొన్నారు.



ముదిగొండ: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

- ముదిగొండ: మండలంలోని ముదిగొండ, వెంకటాపురం, రాఘవాపురం, న్యూలక్ష్మీపురం గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి సోమవారం పరిశీలించారు. న్యూలక్ష్మీపురంలో ఎంపీఓ వాల్మికి కిషోర్ సర్వే సరళిని పరిశీలించి, సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ముదిగొండ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

పఠనాశక్తిని పెంపొందించుకోవాలి



గురుకులంలో గ్రంథాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అభయ ఫౌండేషన్ చైర్మన్ బాలచంద్ర

ఏన్కూరు: విద్యార్థులు పఠనాశక్తిని అలవర్చుకుని మంచి విజ్ఞానాన్ని పొందాలని అభయ ఫౌండేషన్ ఫౌండర్ సీవీ బాల చంద్ర సూచించారు. ఏన్కూరు గురుకుల పాఠశాలలో అభయ ఫౌండేషన్, పూర్వ విద్యార్థులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన నూతన గ్రంథాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఇతరులకు సాయం చేయాలనే సేవాగుణాన్ని కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి, వాసుదేవరావు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బండి గిరిబాబు, సభ్యులు జోగారావు, కృష్ణ, నాగయ్య, భిక్షం, ఆనందరావు, అనీల్, కుటుంబరావు, డిప్యూటీ వార్డెన్ విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవికుమార్, రజిని తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లి గ్రామానికి చెందిన ఖాదర్‌కి షుగర్ వ్యాధి వల్ల అరికాల్లో రంధ్రమై ఆస్పత్రిలో చూపించుకోవటానికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో గాంధీ ద్వారా యువసేన సమితి ఇన్‌ఛార్జ్ తన్నీరు మురళీని సంప్రదించగా యువసేవా సమితి దాతల సహకారంతో రూ.7,738లు సేకరించి సోమవారం బాధితుడికి అందించారు. కార్యక్రమంలో సభ్యులు అశ్రప్ అలీ, గోపి, కిషోర్, ప్రదీప్ పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి



బస్వాపురంలో సీపీఐ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న హేమంతరావు

చింతకాని: సీపీఐ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు పేర్కొన్నారు. మండలంలోని బస్వాపురం గ్రామంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజం ఉనంతవరకు సీపీఐ ఉంటుందని, రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ సత్తా చాటేందుకు శ్రమించాలన్నారు. యువతను పార్టీలోకి చేర్పించి నూతనోత్తేజంతో సభ్యత్వ నమోదును చేపట్టాలని సూచించారు. సీపీఐ నాయకులు శ్రీనివాసరావు, నర్సింహారావు, అంజయ్య, పెద్ద యాలాద్రి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ..

గ్రామ సమస్యలపై కలెక్టర్‌కు..

కొణిజర్ల: మండలంలోని బొట్లకుంట గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసి వినతి పత్రం అందించారు. పెద్దగోపతి సబ్ స్టేషన్ నుంచి ఏళ్ల క్రితం సుబాబుల్ తోటల మీదుగా బొట్లకుంట 11కేవీ విద్యుత్ లైన్లు అమర్చారని, చెట్ల కొమ్మలు తగిలి నిత్యం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. అంతే కాకుంగా విద్యుత్ స్తంభాలు ఇనుప స్తంభాలు కావడం వల్ల వానలకు తుప్పు పట్టి ఏ క్షణంలో విరిగి పడతాయో అన్నట్లు ఉన్నాయని రైతులు, గ్రామస్తులు భయంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అంతే కాకుండా పెద్దగోపతి పంచాయతీ పరిధిలో ఉన్న మూడు శివారు గ్రామాల్లో బొట్లకుంటకు మాత్రమే త్రీఫేస్ కరెంట్ ఇవ్వడం లేదని తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తక్షణమే ట్రాన్స్‌కో ఎస్ఈని ప్రతిపాదనలు సిద్ధం చేసి కొత్త స్తంభాలు, త్రీ ఫేజ్ కరెంట్ సౌకర్యం కల్పించేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సీపీఎం జిల్లా నాయకులు కృష్ణ, కుటుంబరావు, సుధాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్వారీల్లో బ్లాస్టింగ్‌లు జరగకుండా చర్యలు తీసుకోవాలి..



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

ముదిగొండ: కంకర క్వారీల్లో బ్లాస్టింగ్‌లు జరగకుండా చర్యలు తీసుకోవాలని ముదిగొండ, రాఘవాపురం గ్రామస్తులు తహసీల్దార్ సునీత ఎల్జిబెత్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. బ్లాస్టింగ్ వల్ల ఇళ్లు బీటలు వారుతున్నాయని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీ, రాఘవాపురంలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.